ముంచెత్తిన వాన

- ఎడతెరిపి ఇవ్వని వరుణుడు
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు

మండలం	వర్షపాతం మి.మీ.
కొత్తపల్లె	50.8
ఆత్మకూరు	47.8
పగిడ్యాల	36.8 మీ.మీ
పాములపాడు	34.6

ఆత్మకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆత్మకూరు మండలంలోని భవనాశి, పడవాగు, పెద్దవాగు, సుద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సిద్ధాపురం చెరువుకు సైతం భారీగా వరదనీరు చేరింది. నల్లమల అటవీ పరిధిలో భారీ వర్షం కురవడంతో వరదరాజస్వామి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. పట్టణ సమీపంలోని భవనాశి నది పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు నుంచి కురుకుంద, వడ్లరామాపురం, కొట్టాల చెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని 20 గ్రామాల ప్రజలకు ఆత్మకూరు నుంచి రాకపోకలు స్తంభించాయి. కురుకుంద గ్రామానికి చెందిన వనమాలి పుల్లయ్య, లింగస్వామి, వెంకటేశ్వర్లు అనే యువకులు ఆత్మకూరులో పనులు ముగించుకుని మధ్యాహ్న సమయంలో బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా వాగు వద్ద నీటి ఉధృతికి కొట్టుకుపోతుండగా స్థానికులు క ఆపాడారు. కాగా బైకు, రెండు సెల్‌ఫోన్లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఈ సంఘటన అనంతరం కురుకుంద గ్రామానికి ట్రాక్టర్ల ద్వారా ప్రయాణికులను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, సీఐ రాము హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పోలీస్ బందోబస్తు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆ మార్గంలో వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

పగిడ్యాల: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో 36.8 మీ.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శివరాముడు సోమవారం తెలిపారు. గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నల్లవాగు కాలువ ఉప్పొంగింది. వర్షకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్న పైర్లకు తగిన వర్షాలు మాత్రమే కురిశాయి.

మహానంది: నాలుగు రోజులుగా నిరంతరం వర్షం కురుస్తుండడంతో పాత మిద్దెలు, పూరి గుడిసెల్లో ఉంటున్న వారు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పలుచోట్ల వరి, అరటి పొలాల్లో వర్షపు నీరు నిలువ ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోపవరం ఎస్సీ కాలనీలో రోడ్లు జలమయంకావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇళ్లల్లోకి నీరు చేరే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి కాలనీలో ఉన్న వర్షపు నీరు బయటకి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు కాశన్న అధికారులకు విజ్ఞప్తి చేశారు. మసీదుపురం, అబ్బీపురం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉంది. బుక్కాపురం వద్ద తమ్మడపల్లె ఇంజవాని చెరువు పూర్తిగా నిండిపోవడంతో అలుగులు దాటి ప్రవహిస్తుంది. మహానంది – గాజులపల్లె వెళ్లే మార్గంలో ఉన్న పాలేరు వాగు వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన వాగు ఉధృతిని తీరును పరిశీలించారు.


కొత్తపల్లె: బండినాయిని పాలెం వద్ద వరి పొలాలను ముంచెత్తిన వర్షం నీరు


ఆత్మకూరు: వాగు ఉధృతిని పరిశీస్తున్న తహసీల్దార్ రత్నరాధిక


పాములపాడు: చెలిమిల్ల గ్రామంలో వర్షపు నీటితో వంకను తలపిస్తున్న పొలాలు

పాములపాడు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కురిసిన వర్షానికి భవనాశి, సుద్దవాగు, ఒద్దులంక వాగులకు నల్లమల అటవీ ప్రాంతం నుంచి వస్తున్న వర్షపు నీటి ప్రవాహం పెరుగుతూనే ఉంది. దీంతో ఆ వాగులు, వంకలు ఉద్ధతంగా ప్రవహిస్తున్నాయి. సమీప పొలాల్లోకి నీరు వరదలా చేరుతోంది. పంట పొలాలు పూర్తిగా నీటిలో మునగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పొలాలు వర్షపు

నీట మునిగిన పంటలు

నీటితో వంకలను తలపిస్తున్నాయి. నీటిలో మునిగిన పైర్లు పూర్తిగా కుళ్లిపోయాయని, పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే పరిస్థితి ఎలాగని తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. శ్రీశైలానికి ప్రథమ ముఖ ద్వారమైన నందీశ్వరాలయంలోకి భవనాశి నదిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు చేరింది. అంతే కాకుండా ఇస్కాల గ్రామానికి రాకపోకలు నలిచిపోయాయి. దీంతో ప్రజలు ఆత్మకూరు మీదుగా, చెలిమిల్ల గ్రామం మీదుగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. మండలంలోని చెలిమిల్ల, ఇస్కాల గ్రామాల్లో భవనాశి, సుద్దవాగు, ఒద్దులంకవాగు పరీవాహక ప్రాంతాల్లో వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో ఆయా గ్రామాల వీఏఏ ల ద్వారా పంటలు పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. రెండు రోజుల్లో పూర్తిగా పరిశీలించి దెబ్బతిన్న పంటల వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వివరించారు.

బండి ఆత్మకూరు: భారీ వర్షంతో మండలంలో పంట పొలాలు జలమయమయ్యాయి. మండలంలో 38.మీ.మీ వర్షపాతం నమోదైంది. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అతివృష్టితో రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు.


పాములపాడు: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖసిబ్బంది


బండి ఆత్మకూరు: నీటమునిగిన పంట పొలాలు

జన జీవనం అస్తవ్యస్తం


కొత్తపల్లె: ఎద్దులేరు వాగును ట్రాక్టర్ సహాయంతో దాటుతున్న దృశ్యం

కొత్తపల్లి: ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు వర్షం వదలకుండా పడింది. మండలంలోని అన్ని ప్రాంతాలలో 50.8 మి.మీలుగా వర్షపాతం నమోదైంది. రెండు రోజుల క్రితం ఇక వరుణుడు ఒరుపు ఇస్తున్నాడులే అనుకుంటుండగా మళ్లీ భారీ వర్షం పడింది. వరి పంటలు నీటిమునగగా మొక్కజొన్న, పత్తి పంటలలో నీరు చేరింది. దీంతో పంటలు చేతికందే సమయంలో దెబ్బతింటాయని, దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ వర్షానికి ఎం.లింగాపురం, శివపురం గ్రామాల మధ్య ఎద్దులేరు వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. దీంతో శివపురం, సింగరాజుపల్లె, బట్టువారిపల్లె, చిన్న,పెద్ద గుమ్మడాపురాలు, ముసలిమడుగు, ఎర్రమఠం, మాడుగుల, కపిలేశ్వరం సిద్ధేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. అత్యవసర సమయాల్లో ప్రమాదమని తెలిసిన ప్రయాణికులు ఎద్దులేరు వాగును ట్రాక్టర్ సహాయంతో దాటుతున్నారు. ఉప్పొంగి ప్రవహిస్తున్న ఎద్దులేరు వాగును ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి పరిశీలించారు. ట్రాక్టర్‌పై వాగుదాటుతున్న ప్రయాణికులను నిలువరించారు. ప్రయాణికులు, వాహనాలు దాటకుండా ఎస్‌ఐ జయశేఖర్ బందోబస్తు చేపట్టారు. నందికుంట గ్రామ పొలిమేరలో భారీ వర్షానికి నీట మునిగిన పత్తిపంటలను వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం పరిశీలించారు.


పాములపాడు: నందీశ్వరాలయంలోకి చేరిన భవనాశి నది వరద నీరు


ఆత్మకూరు: ప్రాణాలతో బయటపడిన వనమాల పుల్లయ్య, వెంకటేశ్వర్లు


ఆత్మకూరు: భవనాశి నది పొంగి ఇటుక బట్టీల్లోకి చేరిన నీరు


కొత్తపల్లె: గువ్వలకుంట్ల ఎస్సీకాలనీలో చెరువును తలపిస్తున్న ఎస్సీకాలనీ రోడ్లు


ఎద్దులేరు వాగుపై రాకపోకలు నిలిపేసిన ఎస్‌ఐ జయశేఖర్, సిబ్బంది


మహానంది: గోపవరం ఎస్సీ కాలనీలోకి చేర్న వర్షపునీరు


తంగడంచలో వర్షం నీరు నిలిచి దెబ్బతిన్న మొక్కజొన్న పంట

కష్టమంతా నీళ్ల పాలు..

జూపాడుబంగ్లా: పదిరోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతినటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న, మిరప, పత్తి, ఉల్లి, మినుము పొలాల్లో వర్షం నీరు నిల్వవటంతో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న పంటకు ఎకరాకు ఇప్పటికే రూ.30వేలు వెచ్చింగా మిరప ఎకరాకు రూ.40వేలు, ఉల్లికి రూ.40 వేలు, కందికి రూ.30 వేలు, మినుము ఎకరాకు రూ.30వేల చొప్పున పెట్టుబడులు పెట్టారు. అధికవర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నందున వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి పంటనష్టపరిహారం వర్తించేలా చేయాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు రెండు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తుందని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు.


జూపాడుబంగ్లా సమీపంలో నీట మునిగి మొక్కజొన్న పంట

ఫ్యాక్టరీ వివరాలు ప్రజలకు వెల్లడించాలి

జూపాడుబంగ్లా: తంగడంచ రెవెన్యూ పరిధిలోని నిర్మిస్తున్న ఆద్య అగ్రిక్రాఫ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వివరాలు తక్షణమే వెల్లడించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2017లో అప్పటి టీడీపీ పాలనలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు 211 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయించినట్లు తెలిపారు. అక్కడ చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసిన స్థానికులైన నిరుద్యోగ యువతీ, యువకులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు, మండల అధికారులు, తంగడంచ గ్రామ ప్రజలకు వివరాలు ఏవీ తెలియజేయకుండా గుట్టుచప్పుడుకాకుండా ఆద్య అగ్రిక్రాఫ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీని 10 ఎకరాల్లో ఎలా నిర్మిస్తారని ఆయన ప్రశ్నించారు. ఫ్యాక్టరీలో ఎలాంటి ప్రొడక్టులు ఉత్పత్తిచేస్తారు, స్థానికులైన వారికి ఎంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారనే వివరాలు తక్షణమే వెల్లడించాలన్నారు.


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి

నంద్యాల: ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మొట్టమొదట అవయదానం చేసిన బొప్పా సుజాత కుటుంబ సభ్యులకు రూ.50 వేలు నగదు పారితోషికం, ప్రశంసా పత్రాన్ని నంద్యాల కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల మండలం గుంతనాల గ్రామానికి చెందిన బొప్పా సుజాత గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించేదని, గత జూన్ నెల 1వ తేదీన ఆమె రోడ్డు ప్రమాదానికి గురైందన్నారు. బతికించడానికి డాక్టర్లు తీవ్రంగా ప్రయత్నించినా బ్రెయిన్ డెడ్ కావడంతో వీలుకాలేదన్నారు. దీంతో బాధిత మహిళ సోదరి డాక్టర్ విజయ, సోదరుడు సునీల్ కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావడంతో ఏడుగురి జీవితాలలో వెలుగు వచ్చిందన్నారు. అవయవ దానం చేసిన బొప్పా సుజాత సోదరి డాక్టర్ విజయ మాట్లాడుతూ అవయవ దానంపై చాలామందికి అపోహలు ఉన్నాయని, మన కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల తమ మనుషులు బతికి ఉన్నారన్న సంతృప్తి కలుగుతుందన్నారు. తన సోదరి అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నా, ఏ విధంగా ముందుకు వెళ్లాలో తోచలేదని, ఆ సమయంలో రెడ్ క్రాస్‌ను సంప్రదించామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సుజాత కుటుంబ సభ్యులకు నగదు పారితోషికం, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

కాశీవిశ్వేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ ప్రారంభం


గ్రామంలో ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది దేవస్థానానికి దత్తత దేవాలయమైన తమ్మడపల్లెలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వేదపండితులు, అర్చకులు ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం చేసి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి వార్ల మూలమూర్తుల నుంచి కళశాలను తీసి ప్రత్యేక కలశంలో కళావాహన నిర్వహించి బాలాలయం చేపట్టారు. పూజా కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి. సుబ్బారెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

నందికొట్కూరు: భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు కురుస్తున్న భారీ వర్షాలకు మొక్కజొన్న, పత్తి, కంది, పెసర, ఉల్లి, మిరప, మినుము పంటలు నీటిలో మునిగిపోయి పంట దెబ్బతిన్నడం జరిగిందన్నారు. ఎకరాకు రూ, 30 వేలు ఖర్చు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏసన్న, సోమన్న, మహబూబ్‌బాషా, మురళీ, శ్రీరాములు, రామకృష్ణ, శ్రీనివాసులు, మహమ్మద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఎస్సార్ఎంసీకి పెరిగిన నీటి విడుదల

పాములపాడు: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి ఎస్సార్ఎంసీ (శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ)కు నీటి విడుదల 26,000 క్యూసెక్కుల నుంచి 30,000 క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ దేవేంద్ర సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సార్ఎంసీ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చే ఇన్‌ఫ్లో మేరకు.. తెలుగుగంగ(వీబీఆర్)కు 11,000, జీఎన్ఎస్ఎస్‌కు 14,000, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 5,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో ఎంఆర్‌పీఎస్ జెండాను ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి బాషపోగు దరగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. ఎట్టకేలకు మన జాతి ఆరాధ్యదైవం నవయుగ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ పోరాటం వల్ల వర్గీకరణను సాధించుకున్నామన్నారు. ఈ వర్గీకరణను చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ,ప్రభుత్వం రిజర్వేషన్ ను గ్రూప్ 1 ,గ్రూప్ 2 గ్రూప్ 3 అని 15 శాతం రిజర్వేషన్ ను మూడు భాగాలుగా జనాభా దామాషా ప్రకారం వర్గీకరించారని తెలిపారు. మాదిగ ఉపకులాలు సంబంధించి 18 కులాలు గ్రూప్ 2 లో ఉంటామని చెప్పారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చోరీ కేసులో అక్కాచెల్లెళ్ల అరెస్ట్

కర్నూలు (టౌన్): కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో హడావుడిగా బస్సు ఎక్కే ప్రయాణికుల వద్ద బంగారు గొలుసు, బ్యాగ్‌లను కొట్టేసే అక్కాచెల్లెళ్లను ఆదివారం రాత్రి నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ విక్రమసింహ వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 1 గంట సమయంలో జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన పాగిడాల విమలమ్మ కర్నూలు బస్టాండ్‌లో ఆత్మకూరు బస్సు ఎక్కుతుండగా చేతి బ్యాగులో ఉన్న చిన్న పర్సు చోరీకి గురైంది. పర్సులో 4 తులాల బంగారు గొలుసు ఉండటంతో ఈ నెల 16న బాధితురాలు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ విక్రమసింహ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మోహన్ కిషోర్ రెడ్డి, మహిళా ఏఎస్‌ఐలు, క్రైం పార్టీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈనెల 17న కొత్తబస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించారు. వారు కర్నూలు వడ్డె గేరికి చెందిన షేక్ ఖాజాబీ, షేక్ ఫరీదా అనే అక్కాచెల్లెళ్లుగా తెలిసింది. బంగారు గొలుసును దొంగిలించినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

మల్లన్నకు నృత్యార్చన


సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన నటరాజ డ్యాన్స్ అకాడమి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గణనాదం, మూషికవాహన, శివతాండవం, ఓం నమఃశివాయా, అమ్మాపరమేశ్వరి, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు జయశ్రీ, ప్రతిభ, హిమబిందు, అనిత, శరణ్య, హేమవిర్షక, బద్రినాథ్, క్రాంతికుమార్ తదితరులు నృత్యం ప్రదర్శించారు.

పంచమఠాలలో విశేష పూజలు


రుద్రాక్షమఠం వద్ద పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజలు చేపట్టారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి చేసి, అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈవో హరిదాసు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ


సహస్రదీపాలను వెలిగిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవ నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

సన్మానం


తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఏఎస్ఓ హనుమంతును సన్మానిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా కలెక్టర్ రాజకుమారి గణియా, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవాపురస్కార అవార్డులు అందుకొన్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఏఎస్ఓ హనుమంతును సోమవారం కార్యాలయ సిబ్బంది, ప్రజలు ఘనంగా సన్మానించారు. కార్యాలయ డీటీలు సత్యదీప్, నాగన్న, పారుమంచాల దేవసహాయం, తాటిపాడు లక్ష్మన్నగౌడు తహసీల్దార్, ఏఎస్ఓ లకు శాలువకప్పి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కానిస్టేబుల్‌కు హోంమంత్రి అభినందన

మహానంది: మహానంది క్షేత్రంలో ఆదివారం కారులో ఉన్న చిన్నారిని రక్షించిన కానిస్టేబుల్ డి. చంద్రశేఖర్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ప్రశంసిస్తూ పోస్ట్ చేశారు. బీజాపూర్ పట్టణానికి చెందిన రాజు కుటుంబ సభ్యులు స్వామి వారి దర్శనానికి వెళ్తూ కారులో బాలుడిని వదిలేసి వెళ్లారు. కారులో రోదిస్తున్న బాలుడిని చూసిన కానిస్టేబుల్, స్థానికులు వెంటనే అద్దాలు పగులగొట్టి కాపాడారు. దీంతో హోమ్ మంత్రితో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ మందా జావళి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ప్రశంసించారు.

ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: మండ్లెం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్‌కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 19 తేదీ నుంచి 23 తేదీ వరకు మండలంలోని మండ్లెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్‌కేంద్రం నిర్వహించనున్నట్లు తెలిపారు.